ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
ఆదివారం 23 మార్చి 2025



రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6:29 (ఆదివారం సాయంత్రం)
సహర్ 4:58 (సోమవారం ఉదయం)

వడగండ్లు.. కడగండ్లు..



వడుకాపూర్‌లో నేలవాలిన మొక్కజొన్న

- జిల్లాలో 2,627 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
- వరి, మొక్కజొన్న పంటలకు నష్టం
- నష్టపరిహారం చెల్లించాలని రైతుల డిమాండ్
- పంటల బీమా పథకాన్ని అమలుచేయాలి

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

వేసవిలో అకాలవర్షాలు, వడగండ్లు అన్నదాతలను దడ పుట్టిస్తున్నాయి. వాతావరణంలో మార్పులు జరిగి మార్చి, ఏప్రిల్ నెలల్లో ఈదురుగాలులు, వర్షాలతో పం టలు దెబ్బతింటున్నాయి. యేటా రైతులకు ఈ దుస్థితి తప్పడం లేదు. ప్రస్తుతం జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు కురిసిన వడగళ్ల వానకు 2,627 ఎకరాల్లో వరి, మొక్కజొన్న పం టలకు నష్టం వాటిల్లినట్లు జిల్లా వ్యవసాయ శాఖాధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. పొట్ట దశలో, కంకి వేసే దశలో ఉన్న వరి, చివరి దశలో ఉన్న మొక్క జొన్న పంట నేలవాలింది. వరి, మొక్క జొన్న పంటలకు 33 శాతానికి పైగానే నష్టం వాటిల్లింది.

● నష్టం ఇలా...

జిల్లాలో వరి పంట 2 మండలాల్లోని 11 గ్రామాల్లో 33 శాతానికి పైగా 1514 ఎకరాల్లో 1035 మంది రైతులు వరి పంటను నష్టపోయారు. మొక్కజొన్న పంట ఆరు మండలాల్లోని 28 గ్రామాల్లో 1084 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. కూరగాయల పంట 20 ఎకరాలు, మిర్చి 4 ఎకరాలు, పెసర 3 ఎకరాలు, నువ్వు పంట 2 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశామని జిల్లా వ్యవసాయ శాఖాధికారి దోమ ఆదిరెడ్డి తెలిపారు. శుక్రవారం భారీగా వర్షం కురడంతో ము న్ముందు మరిన్ని వర్షాలు పడే అవకాశాలు లేకపోలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం స్పం దించి పంట నష్టపోయిన తమకు పరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

● పంటల బీమా పథకం లేక తీరని నష్టం..

రాష్ట్రంలో నాలుగేళ్లుగా పంటల బీమా పథకం అమ లులో లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. జిల్లాలో అధికంగా వరి, పత్తి, మొక్కజొన్న పంటను రైతులు సాగు చేస్తున్నారు. వర్షాకాలంలో భారీ వర్షాలకు వరి, పత్తి పంటలు దెబ్బతింటుండగా, యాసంగిలో కురిసే అకాల, వడగళ్ల వర్షాలకు వరి, మొక్కజొన్న పంటలు, మామిడి తోటలు దెబ్బతింటున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఫసల్ బీమా పథకాన్ని అమలు చేస్తున్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం ఆ పథకంలో వాటా సొమ్ము చెల్లించి చేరకపోవడంతో రైతులకు పంటల బీమా పథకం వర్తించడం లేదు. గత ఏడాది అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభు త్వం కూడా రెండు పంటలు ముగిసినా కూడా పంటల బీమా పథకాన్ని అమలు చేయడం లేదు. దీంతో పం టలు నష్టపోతే ప్రభుత్వం ఇచ్చే పరిహారం సొమ్ము కోసం ఎదురు చూడాల్సిన

(మిగతా 8వ పేజీలో)

ఫటాఫట్

భూనిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి

ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు



ఆంధ్రజ్యోతి: లద్నాపూర్ భూనిర్వాసితులకు సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలేమిటి?

జీఎం: ఓసీపీ-2 ప్రాజెక్టు విస్తరణలో భాగంగా తమ భూములు కోల్పోయిన లద్నాపూర్ గ్రామస్థులకు ఆర్‌అండ్‌ఆర్ కింద రత్నాపూర్, పన్నూరు గ్రామపంచాయతీల్లో ప్లాట్లు కేటాయించాం. వసతుల కల్పనకు ముందుడుగా వేశాం.

ఆంధ్రజ్యోతి: నిర్వాసితులకు పూర్తి పరిహారం అందజేశారా?

జీఎం: ప్రాజెక్టు విస్తరణలో స్వాధీనం చేసుకున్న 104 ఎకరాలకు సంబంధించి 2015లో ఇచ్చిన అవార్డు ప్రకారం నిర్వాసితులకు రూ.90 కోట్ల పరిహారం చెల్లించాం. ఆర్‌అండ్‌ఆర్ కింద రత్నాపూర్, పన్నూరు,మంథని ప్రాంతాల్లో ప్లాట్ల కేటాయింపు చేపట్టాం.

ఆంధ్రజ్యోతి: రత్నాపూర్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో అభివృద్ధి చేస్తున్నారా?

జీఎం: పన్నూరు, రత్నాపూర్, మంథని ప్రాంతాల్లోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు, నీటి వసతి ఏర్పాటుచేశాం. గుడి, పాఠశాల, అంగన్‌వాడి భవనాలు, పీహెచ్‌సీలకు అదనపు కలెక్టర్ వేణు పనులు ప్రారంభించారు. నిర్వాసిత గ్రామస్థులు సింగరేణి సంస్థకు సహకరించాలి.

- రామగిరి



జిల్లా పేరు మార్చరూ...

పెద్దపల్లి రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా కరీంనగర్ నుంచి పెద్దపల్లి జిల్లాగా ఏర్పడి 12 ఏళ్లు కావస్తున్నా సీడీపీవో కార్యాలయం బోర్డుకు కరీంనగర్ జిల్లా అని అలాగే ఉంది. అధికారుల దృష్టిలో ఉన్న పేరు మార్చకపోవడం విడ్డూరంగా ఉంది. బోర్డును చూసిన పలువురు సీడీపీవో కార్యాలయం కరీంనగర్ జిల్లాలోనే కొనసాగుతుందా అనే అపోహలకు గురవుతున్నారు.

పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి

జూలపల్లి/ఎలిగేడు, మార్చి 22. (ఆంధ్రజ్యోతి) వడగండ్ల వర్షంతో పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నష్టపరిహారాన్ని అందించి ఆదుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి అన్నారు. జూలపల్లి, వడుకాపూర్ గ్రామాల్లో అకాల వర్షంతో దెబ్బతిన్న మొక్కజొన్న పంటలను శనివారం ఆయన మండల వ్యవసాయ అదికారి, బీజేపి నాయకులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు కష్టపడి పండించిన మొక్కజొన్న పంటలు చేతికందె సమయంలో ప్రకృతి వైపరిత్యంతో అపార నష్టం జరిగిందని, ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులను ఆదుకోవాలన్నారు నష్టపోయిన ప్రతి ఎకరానికి రూ.50వేల పరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. లేకుంటే పార్టీ ఆధ్వర్యంలో రైతుల పక్షాన ఉద్యమిస్తామన్నారు. ఏఓ ప్రత్యూష, పార్టీ మండల అధ్యక్షుడు కొప్పుల మహేష్, నాయకులు సురేష్‌రెడ్డి, వేల్పుల ఓదెలు, ఐలయ్య, వేంసాని కొమురయ్య, దొడ్ల రాజయ్య, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఎలిగేడు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి డిమాండ్ చేశారు. దెబ్బతిన్న మొక్కజొన్న పంటలను ఆయన పరిశీలించారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు చేతి కందే దశలో వర్షానికి కొట్టుకుపోయాయన్నారు. ర్యాకల్‌దేవ్‌పల్లిలో మొక్కజొన్న, లాలపల్లి 25ఎకరాల మామిడి పంట దెబ్బతిన్నదని రైతులను ఆదుకోవాలని ఆయన పేర్కొన్నారు. గొట్టెముక్కుల సురేష్‌రెడ్డి, గర్రెపల్లి నారాయణస్వామి, గాదె రంజిత్‌రెడ్డి, మల్లారపు అంజయ్య, రాయపాక మనోహర్, వేణుగోపాల్‌రెడ్డి, పాల్గొన్నారు.

నెలాఖరులోగా ఎల్‌ఆర్ఎస్ ఫీజు వసూలు చేయాలి



పంచాయతీ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీపీవో వీరబుచ్చయ్య

పెద్దపల్లి రూరల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో నెలాఖరులోపు ఎల్‌ఆర్ఎస్ ఫీజు వసూలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య అన్నారు. శనివారం రాఘవపూర్, అప్పన్నపేట, పెద్దకల్వల గ్రామాల్లో పర్యటించారు. గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో సమావేశాలు నిర్వహించి నెలాఖరులోపు పూర్తిస్థాయిలో ఎల్‌ఆర్ఎస్ ఫీజు చెల్లించినట్లయితే 25 శాతం రిబెట్ లభిస్తుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇంటి పన్నులు వంద శాతం వసూలు చేయాలని సూచించారు. ఎంపీవో ఫయాజ్, కార్యదర్శులు రవి, శ్రీలత, నిషాంత్ పాల్గొన్నారు.

పది పరీక్షకు 99.87శాతం హాజరు

పెద్దపల్లి కల్చరల్, మార్చి 22,(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం జరిగిన పదో తరగతి హిందీ పరీక్షకు 99.87శాతం మంది విద్యార్థులు హాజరయ్యారని జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి తెలిపారు. హిందీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఎక్కడ ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదన్నారు. అదనపు కలెక్టర్ ఒక సెంటర్, 3ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 16సెంటర్లను, అసిస్టెంట్ కమిషనర్ పరీక్షల విభాగం 3 సెంటర్లను, జిల్లావిద్యాశాఖ అధికారి 5పరీక్ష కేంద్రాలను సందర్శించారని తెలిపారు. హిందీ పరీక్షకు 7383మంది విద్యార్థులు హాజరయ్యారని, మొత్తం 99.87శాతం హాజరు శాతం ఉందని, పరీక్షలు సజావుగా జరిగాయని ఆమె పేర్కొన్నారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయండి



పశువధశాలను పరిశీలిస్తున్న కమిషనర్ అరుణశ్రీ

కోల్‌సిటీ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని నగర కమిషనర్ జే అరుణశ్రీ అధికారులకు సూచించారు. శనివారం వివిధ డివిజన్లలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆమె పరిశీలించారు. 29వ డివిజన్‌లో మంచినీటి పైప్‌లైన్ల లీకేజీ పనులను పరిశీలించిన ఆమె యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు చేయాలన్నారు. మల్కాపూర్ ఎస్‌టీపీ సమీపంలోని పశువధశాల మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి, ఈఈ రామన్, ఈఈ షాబాద్, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

కమాన్‌పూర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మహిళలు కుట్టుమిషన్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ కాళిందిని అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కుట్టు శిక్షణ శిబిరాన్ని ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో మూడుచోట్ల మహిళలకు కుట్టు శిక్షణ ఇస్తున్నామన్నారు. ఇందులో కమాన్‌పూర్, ఎన్‌టీపీసీ, సుల్తానాబాద్ మండలాల్లో శిక్షణ తరగతులు ప్రారంభించామన్నారు. శిక్షణలో మండలానికి 20మంది చొప్పున ఇస్తున్నామన్నారు. మహిళలు శిక్షణ పొంది ఆర్థికంగా ఎదగాలన్నారు. మహిళ సంఘాలచే స్కూల్ యూనిఫాంలు కుట్టించడం జరుగుతుందని ఆమె తెలిపారు. డీపీఎం నాగేశ్వర్‌రావు, ఏపీఎం శైలజశాంతి, తదితరులు పాల్గొన్నారు.

నేరస్తులకు శిక్ష పడితేనే నేరాల సంఖ్య తగ్గుతుంది



కోర్టు కానిస్టేబుల్‌కు ప్రశంసా పత్రం అందజేస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

కోల్‌సిటీ, మార్చి 22(ఆంధ్రజ్యోతి): నేరస్థులకు శిక్షలు పడితేనే నేరాల సంఖ్య తగ్గుతుందని, దోషులకు శిక్ష పడడంలో కోర్టు కానిస్టేబుళ్లు బాధ్యతగా వ్యహరించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా సూచించారు. శనివారం కమిషనరేట్‌లో పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌ల కోర్టు డ్యూటీ అధికారులు, లైజనింగ్ అధికారులతో సీపీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేరస్థులకు శిక్షపడే విధంగా కోర్టులో సాక్ష్యులను ప్రవేశపెట్టి ట్రయల్ సజావుగా జరిగేలా చూడాల న్నారు. దోషులకు శిక్ష పడడంలో కోర్టు కానిస్టేబుళ్ల పాత్ర కీలకమని, నేరస్థులకు వారెంట్లు, సమన్లు సత్వరమే అందే విధంగా చూడాలన్నారు. ప్రాసిక్యూషన్‌కు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు తెలియజేయాలన్నారు. పీపీల సలహాలు, సూచనలు పాటించాలని, కోర్టులో పెండింగ్‌లో ఉన్న ట్రయల్ కేసులు, వారెంట్లు, సమన్లు, సీసీటీఎన్ఎస్ డాటాలో ఎంట్రీ చేయాలన్నారు. బాధితులకు న్యాయం జరిగినప్పుడే పోలీసులపై నమ్మకం పెరుగుతుందన్నారు. న్యాయమూర్తులు, బాధితులు కోర్టు కానిస్టేబుళ్లను అభినందించే పరిస్థితి రావాలన్నారు.

కోర్టు కానిస్టేబుళ్లకు ప్రశంసా పత్రాలు

విధి నిర్వహణలో క్రమశిక్షణ, నిబద్ధతతో పని చేస్తూ దోషులకు శిక్షలు పడేలా కృషి చేసిన కోర్టు కానిస్టేబుళ్లకు సీపీ ప్రశంసాపత్రాలు అందించారు. హత్యాయత్నం, హత్య, చీటింగ్ కేసుల్లో శిక్షలు పడే విధంగా కృషి చేసిన వారికి లోక్ అదాలత్‌లో కేసులలో ప్రతిభ చూపిన వారికి ప్రశంసా పత్రాలు అందించారు. సమీక్ష సమావేశంలో అదనపు డీసీపీ(అడ్మిన్) రాజు, ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్రరావు, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి, లీగల్ సెల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, సీసీఆర్‌బీసీ ఇన్‌స్పెక్టర్ సతీష్, ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్‌గౌడ్, సీసీ హరీష్, సిబ్బంది ఉన్నారు.

రామగుండం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయండి

అసెంబ్లీలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



గోదావరిఖని, మార్చి 22(ఆంధ్రజ్యోతి): పరిశ్రమలకు, ఆధ్యాత్మిక కేంద్రానికి నిలయమైన రామగుండం నియోజకవర్గాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి నిధులు కేటాయించాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కోరారు. శనివారం అసెంబ్లీలో ఆయన మాట్లాడారు. గోదావరి పరివాక ప్రాంతమైన రామునిగుండాలు, త్రిలింగ రాజరాజేశ్వర స్వామి ఆలయాలు ఉన్నాయని, వీటిని అభివృద్ధి చేయాలని, సింగరేణి సంస్థ 7ఎల్ఈపీ బొగ్గు గనిని గతంలో మైనింగ్ టూరిజంగా ఏర్పాటు చేసి మూసివేశారని, దానిని పునః ప్రారంభించాలని కోరారు. ఈ ప్రాంతాన్ని టూరిజం హబ్‌గా మార్చి రీసార్ట్‌లను, హరిత హోటళ్లను ఏర్పాటు చేయాలని, పారాగ్లైడింగ్, హాట్ బెలూన్స్, గోదావరినదిలో బోట్లను ఏర్పాటు చేయాలని కోరారు.

వారసంతలో నీడ కరువు

- గద్దెలు నిర్మించారు.. షెడ్ల నిర్మాణం మరిచారు
- ఇబ్బందుల్లో క్రయవిక్రయదారులు



సంతలో పైకప్పులేని ఖాళీ గద్దెలు

రామగిరి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ప్రభావిత ప్రాంత గ్రామాలకు సౌకర్యంగా ఉన్న వార సంత సమస్యల వలయంలో కొట్టుమి ట్టాడుతోంది. మండల కేంద్రంలోని పారిశ్రామిక ప్రాంత సెంటినరీ కాలనీలో ప్రతీ బుధవారం సంత కొనసాగుతోంది. మండలంలోని పరిసర గ్రామాలతోపాటు ముత్తారం, 8వకాలనీ, గోదావ రిఖని, మంథని ప్రాంతాల నుంచి పెద్దఎత్తున కూరగాయలు, ఇతర వస్తువుల అమ్మ కాలు కొనసాగు తాయి. కూరగాయలు విక్రయిం చేందుకు వీలుగా సింగరేణి యాజమాన్యం గద్దెలను ఏర్పాటు చేసి వదిలివేశారు. దశాబ్దల కాలంగా కొనసాగుతున్న వారంతపు సంతలో క్రయవిక్రయదారులకు నిలువ నీడ లేని పరిస్థితి నెలకొంది. గద్దెలపై కవర్లు కప్పుకొని విక్రయిస్తు న్నారు. దీంతో ఎండ, వాన కాలాల్లో వ్యాపారుల పరిస్థితి మరింత దుర్భరంగా ఉంటోంది.

మార్కెట్ పై ఆదాయం పొందే గ్రామపం చాయతీ అధికారులు సమస్యను పరిష్కరించ డం లేదనే ఆరోపణలున్నాయి. సంతలో 15 గద్దెలు నిర్మించగా వ్యాపార సంస్థలకు సంబంధించిన బాత్ రూంల నుంచి వచ్చే మురుగు నీరు సంతలోకి చేరి దుర్గంధం వెదజల్లుతోంది. మార్కెట్ చుట్టు ప్రహరీ లేని కారణంగా పందులు, కుక్కలు, పశువులు స్వైరవిహారం చేయడంతో వ్యాపారులు ఇబ్బందులకు గురవుతున్నారు. వారసంతలో నెలకొన్న సమ స్యల పరిష్కారానికి సింగరేణి యాజమాన్యం దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

ఎండకు ఎండుతున్నాం, వానలకు తడుస్తున్నాం..



సెంటినరీకాలనీ వారసంతలో ఎండకు ఎండుతున్నాం, వానలకు తడుస్తు ఇబ్బందులకు గురి అవుతున్నాం. మా గోస పట్టించుకునే వారు లేరు. దిమ్మెలపై రేకుల షెడ్డులు ఏర్పాటు చేస్తే వ్యాపారం సజావుగా కొనసాగించే అవకాశం ఉంది. -సుజాత(వ్యాపారస్తురాలు)

సింగరేణి కృషి చేయాలి



సెంటినరీకాలనీలో వారంతపు సంతలో వ్యాపారం చేసుకోవడం పెద్ద ఇబ్బందిగా మారింది. ఎండ, వానలతో ఏండ్లుగా ఇబ్బంది పడుతున్నాం. సమస్య పరిష్కారానికి సింగరేణి లేదా గ్రామపంచాయతీ కృషి చేయాలి. సృజన(వ్యాపారస్తులు)

మద్యం మత్తులో వాహనాలు నడిపిన 41మందికి జైలు శిక్ష

వేములవాడ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో వాహనాలు నడిపి పట్టుబడిన 91మంది మందుబాబులకు వేములవాడ జూనియర్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జ్యోతిర్మయి జైలుశిక్ష, జరిమానా విధించినట్లు వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపారు. గత 14రోజుల వ్యవధిలో జరిపిన వాహనాల తనిఖీ సందర్భంగా మద్యం సేవించి పట్టుబడిన వారిని శనివారం కోర్టులో ప్రవేశపెట్టామని, వీరిలో ఇద్దరికి ఏడు రోజులు జైలు శిక్ష, ఏడుగురికి మూడు రోజులు జైలు శిక్ష, ఐదుగురికి ఐదు రోజులు జైలు శిక్ష, 27 మందికి రెండు రోజుల జైలు శిక్ష, మిగతా 50 మందికి జరిమానా విధించారని ఆయన వెల్లడించారు.

గిరిజన మహిళలకు రూ.20 వేల జరిమానా

ఎల్లారెడ్డిపేట, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ నిబంధనలను ఉల్లంఘించిన ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్ తండాకు చెందిన గిరిజన మహిళకు జ్యోతికి తహసీల్దార్ సుజాత రూ.20 వేల జరిమానా విధించారని ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ శనివారం తెలిపారు. తండాకు చెందిన గిరిజన మహిళ జ్యోతి గతంలో సారా తయారు చేస్తూ పట్టుబడగా తహసీల్దార్ ఎదుట హాజరుపరిచామని పేర్కొన్నారు. బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించడంతో ఆమెకు రూ.20 జరిమానా విధించారని చెప్పారు. సారా తయారీ, అమ్మకాలు సాధించడంతో పాటు బైండోవర్ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు.

మెడికల్ కళాశాలలో కాంట్రాక్టు కార్మికుల వెట్టి చాకిరి

- వేతనంలో రూ.4500 కోత
- అడిగితే ఉద్యోగం నుంచి తొలగింపు.
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న ఏజెన్సీ నిర్వాహకుడు



కళ్యాణ్‌నగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వకుండా వేతనంలో రూ.4568కోత విధిస్తున్నట్లు కార్మికులు ఆరోపించారు. మెడకల్ కళాశాలలో 75 పారిశుధ్య, సెక్యూరిటీ పోస్టులకుగాను 42మంది విధుల్లో ఉన్నారు. ఎలైన్ ఏజెన్సీ ఈ కాంట్రాక్టును దక్కించుకున్నది. ఇందులో 22మంది శానిటేషన్ విభాగంలో, సెక్యూరిటీ విభాగంలో 23మంది కార్మికులు పని చేస్తున్నారు. వీరికి వేతనం రూ.16500లకుగాను రూ.875 పీఎఫ్, రూ.52 ఈఎస్‌ఐకి జమ అవుతుండగా మిగితా రూ.15,573 రావాల్సి ఉండగా రూ.11005 మాత్రమే కాంట్రాక్టర్ చెల్లిస్తున్నారు. ఈ విషయమై ప్రశ్నించిన వారిని ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారు. రూ.4568 ఎందుకు కోత విధిస్తున్నారో కాంట్రాక్టర్ చెప్పడం లేదు. అంతేకాకుండా కార్మికులపై కూడా పని భారం మోపుతున్నారు. నలుగురు పని చేసే చోట ఇద్దరితో పని చేయిస్తు న్నారు. కళాశాలలో మూడు షిఫ్టుల్లో 42మంది మాత్రమే పని చేస్తున్నారు. ముగ్గురు సూపర్‌వైజర్ విధులు నిర్వ హించాల్సి ఉండగా ఇద్దరితోనే నెట్టుకు వస్తున్నారు. 75పోస్టులకు గాను మిగతా 33పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని భర్తీ చేయక పోవడంతో కార్మికులు పని భారంతో ఇబ్బందులు పడుతున్నారు.

● అడ్వాన్స్‌లు, ప్లేడేలు లేవు...

కాంట్రాక్టు కార్మికులకు దసరా, దీపావళి అడ్వాన్స్, బోనస్ కాంట్రాక్టర్ చెల్లించడం లేదు. ప్లేడేలో డ్యూటీ చేసినా కూడా రెస్ట్ ఇవ్వడం లేదు. నెలకు నాలుగు సెలవులు ఇవ్వాల్సి ఉండగా సెలవు దినాల్లో కూడా పని చేయించుకుంటున్నారు. ఆరోగ్యం బాగా లేకపోయినా విధులకు హాజరు కావాలని అంటున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● అడిగితే తొలగిస్తామని బెదిరింపు

అసలు వేతనం రూ.16500 అయితే చేతికి వచ్చేది రూ.11005 మాత్రమే ప్రతీ నెలా కాంట్రాక్టర్ ఖాతాలో జమ చేస్తున్నాడు. ఇందులో కాంట్రాక్టర్ పీఎఫ్ రూ.875, ఈఎస్‌ఐ రూ.52 జమ చేస్తున్నారు. తమకు వచ్చే చాలీ చాలని వేతనాలతో ఇబ్బందులకు గురవుతు న్నామని, రోజు రోజుకు నిత్యా వసర ధరలు పెరిగిపోతున్నాయని, అసలు వేతనంలో కోత విధిస్తే ఎలా బతకాలని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే పని లేదంటూ వెళ్లగొడుతున్నారని, తాము ఎవరికి చెప్పుకోలేని పరిస్థితుల్లో ఉన్నామన్నారు.

-వేతనాల్లో కోత విధిస్తున్నారు..

- శనిగరపు చంద్రశేఖర్, ఏఐటీయూసీ అధ్యక్షులు



కార్మికుల చేత మెడికల్ కళాశాలలో పని చేయిస్తున్న కాంట్రాక్టర్ వారికి రూ.16500 వేతనం ఇవ్వాల్సి ఉండగా రూ.4528 కోత విధించి కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. దీనిపై గతంలో ప్రిన్సిపాల్‌కు కూడా ఫిర్యాదు చేశాం. అయినా పట్టించుకోవడం లేదు.

పనిముట్లు కూడా ఇవ్వడం లేదు...

- అబ్దుల్ కరీం, కార్మిక నాయకుడు



శానిటేషన్ విభాగంలో పని చేసే కార్మికులకు పనిముట్లు ఇవ్వడం లేదు. పెనాయిల్, చీపుర్లు ఇవ్వాల్సి ఉండగా ఆరు నెలలకోసారి కూడా వాటిని ఇవ్వకుండా ఆ బిల్లును కూడా కాంట్రాక్టర్ జేబులో వేసుకుం టున్నారు. శ్రమ దోపిడీకి గురి చేస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

కమాన్‌పూర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జూలపల్లి గ్రామంలో ఆదర్శ నగర్‌లో శనివారం సాయంత్రం ఎస్సై కొట్టెప్రసాద్ ఆధ్వర్యంలో పేకాట స్థావరంపై దాడిచేయగా నలుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. ఆదర్శనగర్‌లోని ఇల్లుటూరి పుల్లయ్య ఇంట్లో పేకాట ఆడుతున్నారని పక్కా సమాచారంతో ఎస్సై దాడి చేయగా 8ఇంక్లైన్‌కాలనీకిచెందిన నలుగురు పట్టుబడగా వారివద్ద నుంచి రూ.2450 నగదు, రెండు సెల్‌ఫోన్లు పట్టుబడ్డాయి. స్టేషన్‌కు తరలించారని ఎస్సై కొట్టెప్రసాద్ తెలిపారు.

దాడికి పాల్పడిన సంఘటనలో ముగ్గురిపై కేసు

ఎల్లారెడ్డిపేట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): దాడికి పాల్పడిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం అగ్రహారం గ్రామానికి చెందిన మునిగె బాలమల్లయ్య, అతడి కొడుకులు శివాజీ, విష్ణులపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రమాకాంత్ శనివారం తెలిపారు. గ్రామంలోని మునిగె శంకర్ ఈ నెల 21న తన ఇంటి వద్ద మూత్ర విసర్జన చేస్తున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన మునిగె బాలమల్లయ్య గొడవకు దిగాడని పేర్కొన్నారు. ఇద్దరి నడుమ గొడవ చోటు చేసుకోవడంతో శంకర్ సోదరుడు దేవయ్య అక్కడకు చేరుకుని ఎందుకు తిడుతున్నావని బాలమల్లయ్యను ప్రశ్నించాడని తెలిపారు. ఆగ్రహించిన బాలమల్లయ్య, అతని కొడుకులు శివాజీ, విష్ణులు శంకర్, దేవయ్యలను దూషిస్తూ కర్రలతో దాడికి దిగారని పేర్కొన్నారు. అడ్డుగా వెళ్లిన శంకర్ భార్య భాగ్యలక్ష్మి, సోదరి మంజుల, వదిన అమృతలను చితకబాదారని చెప్పారు. బాధితుడు శంకర్ ఫిర్యాదుతో ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రమాకాంత్ వివరించారు.

అస్వస్థతకు గురై ఉపాధిహామీ కూలీ మృతి



లచ్చయ్య (ఫైల్)

చందుర్తి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ఉపాధిహామీ పనులు చేస్తున్న ఓ కూలీ అస్వస్థతకు గురై పనిచోటనే మృతిచెందిన సంఘటన చందుర్తి మండలం ఎనగల్ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పసుల లచ్చయ్య(60) అనే ఉపాధి హామీ కూలీ కొంతకాలంగా గ్రామంలో ఉపాధిహామీ పనులకు హాజరవుతున్నాడు. శనివారం గ్రామంలో రోడ్డుపనులకు హాజరయ్యాడు. విరామ సమయంలో భోజనం చేస్తుండగా ఒక్కసారిగా కుప్ప కూలిపోయాడు. వెంటనే తోటికూలీలు చికిత్స నిమిత్తం వేములవాడలోని ఏరియాఆసుపత్రి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడికి భార్య రాజేశ్వరి, కొడుకు, కూతురు ఉన్నారు. ప్రభుత్వపరంగా ఆర్థిక సాయం అందిస్తామని ఎంపీడీవో ప్రదీప్ కుమార్, ఏపీవో రాజయ్యలు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

తంగళ్లపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన మామిండ్ల మహేష్ (24) చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. పోలీసులు కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. నాలుగు సంవత్సరాల క్రితం మహేష్ వివాహం చేసుకోగా, ఇప్పటివరకు సంతానం కలగలేదు. దీంతో తీవ్రమనస్తాపం చెంది ఈనెల17వ తేదీన పురుగుల మందు తాగాడు. మహేష్‌ను ఎల్లారెడ్డిపేటలోని ఓప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతిచెందాడు. మృతుడికి భార్య కల్పన ఉంది. ఈసంఘటనపై పోలీసులు కేసునమోదు చేసుకొనిదర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

బోయినపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన బోయినపల్లి మండలం మానువాడ గ్రామంలో శనివారం జరిగింది. గ్రామానికి చెందిన దాసరి నర్సయ్య(58) తన ఇంటి ఎదురుగా మునగచెట్టు విద్యుత్ తీగల వరకు ఉన్నాయని, కొమ్మలను తొలగించేందుకు చెట్టు పైకి ఎక్కాడు. ప్రమాదవశాత్తు నరసయ్య విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పృథ్వీధర్‌గౌడ్ తెలిపారు.

ఉరివేసుకుని మహిళ బలవన్మరణం

జూలపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెలుకుంట గ్రామానికి చెందిన మేకల పద్మ(48) జీవితంపై విరక్తిచెంది శుక్రవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. పద్మ భర్త తిరుపతి బతుకుదెరువు కోసం 13ఏండ్ల క్రితం మలేషియా వెళ్లి 11నెలల క్రితం ఇంటికి వచ్చాడు. నెల రోజుల నుంచి తిరుపతికి జ్వరం వస్తుండగా ఆసుపత్రిలో చూపించగా టీబీ ఉన్నట్లు డాక్టర్ చెప్పారు. తిరుపతిని మరిన్ని పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ సూచించారు. అందుకు తిరుపతి ఒప్పుకోలేదు. భార్య పద్మ అతనికి ఎన్నిసార్లు చెప్పినా వినకపోవడంతో ఆవేదనకు గురైంది. జీవితంపై విరక్తి చెందిన పద్మ ఇంట్లో పురుగుల మందుతాగి, ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పద్మకు కూతురు, కొడుకు ఉన్నారు. మృతురాలి భర్త తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సనత్‌కుమార్ తెలిపారు.

విద్యుత్ టవర్ ఎక్కిన లారీ డ్రైవర్

పాలకుర్తి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని బసంత్ నగర్ సిమెంటు కంపెనీ సమీపంలోని విద్యుత్ హైటెన్షన్ టవర్ ఎక్కి శనివారం లారీడ్రైవర్ సార్లనరేష్ హంగామా సృష్టించాడు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ ఆర్ స్వామి సంఘటన స్థలానికి చేరుకొని నరేష్‌ను అదుపులోకి తీసుకొని కౌన్సెలింగ్ ఇచ్చారు. నరేష్ నిత్యం సేవించి లారీ నడిపేవాడని, ఇది గమనించిన లారీ అసోసియేషన్ సభ్యులు అతడిని విధుల్లో నుంచి తొలగించారు. దీంతో ఉపాధి పోయిందనే మనస్తాపానికి గురై ఈ సంఘటనకు పాల్పడ్డాడని తెలిపారు.

జైలులో మౌలిక వసతుల పరిశీలన

కరీంనగర్ క్రైం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా జైలును కరీంనగర్, పెద్దపల్లి న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శులు కె.వెంకటేష్, కె.స్వప్న శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా జైలులోని ఖైదీలతో మాట్లాడి భోజన, న్యాయసేవలు, ఆరోగ్యం, ఇతర సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. ప్రైవేట్‌గా న్యాయవాదిని నియమించుకునే స్థోమత లేనివారికి ప్రభుత్వ న్యాయవాదిని నియమిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా జైలు సూపరింటెండెంట్ జి.విజయ్‌డేని, జైలర్లు పి.శ్రీనివాస్, బి.రమేష్, డిప్యూటీ జైలర్లు ఎ.శ్రీనివాస్‌రెడ్డి, ఎస్.సుధాకర్ రెడ్డి, ఎల్ రమేష్, కె.శేఖర్, పెద్దపల్లి కోర్టు సూపరింటెండెంట్, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ అడ్వకేట్‌లు శ్రీనివాస్, కె.సంకీర్తన పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న యువకుడి అరెస్ట్

మెట్‌పల్లిటౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని మేడిపల్లి గ్రామశివారులో శనివారం ఎస్‌ఐ అనిల్ కుమార్ వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా గంజాయి తరలిస్తున్న పోగుల అజయ్ అనే యువకుడిని పట్టుకున్నట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. అజయ్ మెట్‌పల్లి వైపు ద్విచక్రవాహనం మీద వెళ్తుండగా పోలీసులను చూసి తప్పించకొనే ప్రయత్నం చేయగా వెంబడించి పట్టుకున్నారు. అతడివద్ద నుంచి 300గ్రాముల గంజాయి, ఒకఫోన్, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పెర్కోన్నారు. గంజాయి తరలిస్తే కఠినచర్యలు తీసుకుంటామని సిఐ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ అనిల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ నిరంజన్‌రెడ్డి

ఆటో ట్రాలీ బోల్తా

● 16 మంది మహిళా కూలీలకు గాయాలు ● ముగ్గురి పరిస్థితి విషమం



సంఘటన స్థలంలో బోల్తా పడిన ఆటో ట్రాలీ

మంథనిరూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భట్టుపల్లి గ్రామానికి చెందిన మహిళా కూలీలను తీసుకువెళ్తున్న ఆటో ట్రాలీ బోల్తా పడిన ఘటనలో 16మందికి తీవ్ర గాయాలు కాగా ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. భట్టుపల్లి గ్రామానికి చెందిన 20 మంది మహిళ కూలీలు గ్రామానికి చెందిన సతీష్ అనే వ్యక్తికి చెందిన టాటా ఏసీ ట్రాలీలో భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలంలోని మల్లారంలో మిర్చి ఏరడానికి ఉదయం 7 గంటల సమయంలో బయలుదేరి వెళ్ళారు. నాగెపల్లి వద్దకు రాగానే ఆటోస్టిరింగ్ రాడ్ విరిగిపోవడంతో ఆటో అదుపు తప్పి మంథని-కాటారం ప్రధాన రహదారిపై బోల్తాపడింది. ప్రమాదంలో గాయపడ్డ వారందరిని మంథని ప్రభుత్వ ఆసుపత్రికి స్థానికులు తరలించారు. ఇందులో బండెల కిష్టమ్మ, అప్పాల శైలజ, అప్పాల వనితలకు తీవ్రగాయాలు కావడటంతో వారిని కరీంనగర్‌కు తరలించారు. వీరితోపాటు గడ్డి మల్లక్క, సత్తెమ్మ, సమత, ఎర్రమ్మ, కందుల రాజేశ్వరి, పోశక్క, పొలగాని సమ్మక్క, కొమురక్క, జంగా లక్ష్మి, స్రవంతి, కమల, బొద మల్లమ్మలకు మంథనిలో ప్రథమ చికిత్స అనంతరం గోదావరిఖని, పెద్దపల్లి ఆసుపత్రులకు తరలించారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ రామకృష్ణతో ఫోన్‌లో మాట్లాడి గాయపడ్డవారికి చికిత్స చేసి మెరుగైన చికిత్స కోసం గోదావరిఖని, కరీంనగర్‌కు తరలించాలని సూచించారు. కాంగ్రెస్ నేతలు ఐలి ప్రసాద్, ఆరెల్లి కిరణ్‌గౌడ్‌లు ఆసుపత్రికి వచ్చి బాధితులతో మాట్లాడారు. గోదావరిఖనిలో ప్రభుత్వ ఆసుపత్రి వెళ్ళిన క్షతగాత్రులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందే విధంగా ఏసీపీ మడత రమేష్ ఆసుపత్రికి వచ్చి పర్యవేక్షించారు. మంథని సీఐ రాజు, ఎస్‌ఐ రమేష్‌లు ఆసుపత్రికి వచ్చి సంఘటన వివరాలు సేకరించారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టిన స్కూల్ బస్సు

● డ్రైవర్‌కు స్వల్పగాయాలు



ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టిన స్కూల్ బస్సు

కోరుట్ల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను శనివారం స్కూల్‌వ్యాన్ ఢీకొట్టడంతో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఆ సమయంలో బస్సులో విద్యార్థులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పోలీసులు, స్థానికులు తెలిపినవివరాల ప్రకారం.. గౌతమ్‌హైస్కూల్ విద్యార్థులను పాఠశాలకు తరలించేందుకే వెళ్తుండగా ప్రమాదం జరిగింది. హాజీపుర వైపువ్యాన్‌ను తీసుకుపోయే క్రమంలో వ్యాన్‌రోడ్డు ప్రక్కకు ఉన్న ట్రాన్‌ఫార్మన్ అతివేగంగా ఢీకొట్టింది. దీంతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ భారీ శబ్దంతో పేలిపోయింది. దీంతో విద్యుత్‌సరఫరాలో అంతరాయం ఏర్పడింది.స్థానికులు విద్యుత్ అధికారులతోపాటు పోలీసులకు సమాచారం అందించారు. డ్రైవర్ అవదూత మారుతి స్వల్పగాయలతో బయటపడగా స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సను అందించారు. విద్యుత్ అధికారుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐశ్రీకాంత్ తెలిపారు. అనంతరం విద్యుత్‌సరఫరాను పునరుద్ధరించారు.

పుట్టెడు దుఃఖంలో పదో తరగతి పరీక్ష రాసిన విద్యార్థిని

శంకరపట్నం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తగట్టు గ్రామానికి చెందిన ఓ విద్యార్థిని పుట్టెడు దుఃఖంలో పదో తరగతి పరీక్ష రాసింది. మండలంలోని కొత్తగట్టు గ్రామానికిచెందిన చీర్లంచ ప్రియాంక(34) కొన్నిరోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ హైదరాబాద్ లోని నిమ్స్‌లో చికిత్సపొందుతోంది. శనివారం తెల్లవారుజామున ఆమె మృతిచెందింది. ఈ విషయాన్ని ప్రియాంక కూతురు పౌర్ణమికి తెలియకుండా పరీక్షరాసే వరకు వేచి చూశారు. పరీక్షలు రాసిన అనంతరం తల్లి మృతిచెందిన విషయాన్ని చెప్పడంతో సిరిసిల్ల జిల్లాలో పరీక్షరాసిన పౌర్ణమి హుటాహుటిన కొత్తగట్టు గ్రామానికి చేరుకుంది. తల్లి మృతదేహంపై పడి గుండెలు విసేలా రోధించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

● రైతులకు మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ

కరీంనగర్ అర్బన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వర్షాలతో పంటలు దెబ్బతిన్న రైతులు అధైర్యపడవద్దని, రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటనలో హామీ ఇచ్చారు. ఉమ్మడి జిల్లాతోపాటు ఉత్తర తెలంగాణ జిల్లాల్లో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షాలు, వడగండ్ల వానతో పంటలకు నష్టం వాటిల్లడంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. వడగండ్ల వానతో మామిడి, వరి పంటలు దెబ్బ తిన్నాయని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. వెంటనే అధికారులను పంపించి దెబ్బతిన్న పంటలను పరిశీలించాలని కోరినట్లు తెలిపారు.

పెద్దపల్లి ట్రాలీ ఆటో ఘటనపై దిగ్ర్భాంతి

పెద్దపల్లి జిల్లా మంథని మండలం నాగేపల్లి బస్‌స్టాప్ వద్ద ట్రాలీ ఆటో బోల్తా ప్రమాదంపై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. ప్రమాద ఘటనపై జిల్లా కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలి

● చిన్న హనుమాన్ జయంతి ఏర్పాట్లపై కలెక్టర్, ఎస్పీ సమీక్ష



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

మల్యాల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కొండగట్టులో వచ్చేనెల11 నుంచి జరిగే చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాలకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. శనివారం కొండగట్టులో ఎస్పీ అశోక్‌కుమార్‌తో కలిసి జయంతి ఏర్పాట్లను పరిశీలించారు. కోనేరు, దీక్షవిరమణ మండపం, వైజంక్షన్ తదితర ప్రాంతాల్లో చేపట్టాల్సిన ఏర్పాట్ల గురించి తెలుసుకున్నారు. జయంతి సందర్భంగా చేపట్టే ఏర్పాట్ల గురించి సమీక్షజరిపారు. మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, దీక్ష విరమణ మండపం వద్ద బారికేడ్ల ఏర్పాటును పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. విద్యుత్ లైట్స్, చలువ పందిళ్ల, తాగునీరు, మొబైల్ టాయిలెట్స్ పారిశుధ్యానికి సంబంధించి పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అన్నారు. ట్రాన్స్‌కో, పంచాయితీరాజ్, రెవెన్యూ, పోలీస్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో ఉత్సవాల విజయవంతంకు కృషి చేయాలని అన్నారు. అంతకు ముందు స్వామి వారి సన్నిధిలో కలెక్టర్, ఎస్పీ పూజలు నిర్వహించగా అధికారులు సన్మానించారు. వారివెంట జగిత్యాల ఆర్డీవో మధుసూధన్, ఆలయఈవో శ్రీకాంత్‌రావు, డిఎస్పీ రఘు చందర్, డీపీవో మదన్‌మోహన్, మల్యాల సీఐ నీలం రవి, ఎస్సై నరేశ్‌కుమార్ వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంతరిస్తున్న తాటి వనాలు

● ఉపాధి కోల్పోతున్న కల్లుగీత కార్మికులు




జూలపల్లి శివారులో ఎండిపోతున్న తాటిచెట్లు

జూలపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): గీత కార్మికులకు ఉపాధి ఇస్తున్న తాటి చెట్లు అంతరిస్తున్నాయి. మొగిరోగం సోకి ఎండిపోతున్నాయి. కల్లు విక్రయింతో ఉపాధి పొందుతున్న కల్లుగీత కార్మికుల కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితులు నెలకొన్నాయని మండల కల్లుగీత కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జూలపల్లి, కుమ్మరికుంట, కాచాపూర్, వడుకాపూర్, తెలుకుంట తదితర గ్రామా ల్లో తాటిచెట్లకు మొగిరోగంతో క్రమంగా అవి అంతరించి పోతున్నా యని గౌడ కులస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాటిచెట్ల సంరక్షణపై అధికారులు దృష్టి సారించకపోవడంతోనే వనాలు అంత రించిపోతున్నాయని గౌడ కులస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాటిచెట్లు ఎక్కడం ప్రాణాలకే ప్రమాదం అని తెలిసినా పొట్ట కూటికోసం కల్లుగీయక తప్పడం లేదంటున్నారు. తాటిచెట్లు ఎండి పోతుండడంపై కల్లుగీతకార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇతర ఉపాధి మార్గాలను చూపాలని వారు కోరుతున్నారు.

కల్లులేక రోజు కూలి గిట్టడంలేదు

- బొంగాని కమలాకర్‌గౌడ్, గౌడసంఘం మాజీ ఉపాధ్యక్షులు గ్రామం,మం, జూలపల్లి



వారసత్వంగా వస్తున్న కల్లుగీత వృత్తిపైనే ఆధారపడి బతుకుతున్న తమ కుటుంబాలకు ప్రస్తుతం గడ్డు పరిస్థితులు ఏర్పడ్డాయి. గ్రామాల్లోని తాటిచెట్లకు రోగాలు సోకి ఎండిపోతున్నాయి. వాటిని కాపాడేప్రయత్నం ప్రభుత్వం చేపట్టాలి. రోజురోజుకు చెట్లు ఎండిపోయి కల్లులేక రోజువారి కూలి కూడా రావడం లేదు.

ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా ఉపాధిచూపాలి

- అమరగాని మల్లేశం, కల్లుగీత కార్మికుడు గ్రామం, మం. జూలపల్లి.



ఎన్నో ఏండ్లుగా తాటిచెట్లనే ఉపాధిగా చేసుకని తమ కుటుంబాలను వెల్లదీస్తున్నాం. తాటిచెట్లు రోగాలతో ఎండిపోతున్నాయి. ప్రస్తుతం తమకు పూటగడవడం కష్టంగా మారింది. ప్రభుత్వమే తమకు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను చూపి ఆదుకోవాలి.

రాజన్న ఆలయంలో 30 నుంచి

శ్రీరామ నవరాత్రోత్సవాలు



వేములవాడ కల్చరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో వారం రోజులపాటు ఉగాది, శ్రీరామ నవరాత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజన్న ఆలయంలో మార్చి 30వ తేదీ నుంచి ఏప్రిల్ 6వ తేదీ వరకు ఎనిమిది రోజుల పాటు ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. ప్రతి నిత్యం ఉదయం 6.30 గంటల నుంచి శ్రీస్వామివారలకు శ్రీసీతారామ చంద్ర స్వామివారలతో పాటుగా పరివార అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 30వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటల నుంచి స్వస్తి పుణ్యాహావాచనం, ఋత్విగ్వరణం ఘనంగా నిర్వహించనున్నారు. ఉదయం 10.15 పంచాంగ పూజ సాయంత్రం 4.30 గంటలకు పంచాంగ శ్రవణం, పండిత సన్మానం, రాత్రి 8 గంటలకు స్వామివారి పెద్దసేవ ఊరేగింపును కన్నులపండుగగా చేపట్టనున్నారు. అంతేకాకుండా 4వ తేదీ శుక్రవారం నుంచి 6వ తేదీ ఆదివారం వరకు మూడు రోజులపాటు భక్తోత్సవం, హవనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

6న సీతారాముల కల్యాణం

వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో సీతారామచంద్రుల దివ్య కల్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా ఏప్రిల్ 6వ ఆదివారం నిర్వహించనున్నారు. అనంతరం వైభవంగా స్వామివారి రథోత్సవం రాత్రి డోలోత్సవం నిర్వహించనున్నారు.

ఇంటర్ తర్వాత వివిధ కోర్సులు



విద్యార్థులకు 113 కోర్సులను సూచించిన సీబీఎస్ఈ

చొప్పదండి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం చాలా మంది విద్యార్థులు ఇంటర్ తరువాత ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరుతు న్నారు. ఇంజనీరింగ్ కోర్సుల్లోనూ కంప్యూటర్ సైన్స్ వైపు మొగ్గు చూపుతున్నారు. ఇంటర్ తరువాత ఇంజనీరింగ్‌తో పాటు 113 కోర్సుల జాబితాను సీబీఎస్ఈ విద్యార్థులు, తల్లిదండ్రుల కోసం బుక్ లెట్‌ను రూపొం దించింది. ఇంజనీరింగ్ కోర్సు, ఫిషరీస్, ఎన్విరాన్మెంటల్ సైన్స్ ఫుడ్ టెక్నాలజీ, ఫారెస్ట్రీ, హార్టికల్చర్, చార్టెడ్ అకౌంటెంట్ లాంటి అనేక రంగాలలో ఉద్యోగాలను కల్పించే కోర్సులు ఉన్నాయి.ఈ నేపథ్యంలో ఇంటర్ తరువాత అందుబాటులో ఉన్న వివిద డిప్లమా, డిగ్రీ కోర్సుల వివరాలు విద్యార్థుల కోసం...

● ఇంజనీరింగ్ కోర్సులు:



ఎరోనాటికల్ ఇంజనీరింగ్, ఎరోస్పేస్ ఇంజనీరింగ్, ఆర్కిటెక్చర్ ఇంజనీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్, ఆటోమొబైల్ ఇంజనీరింగ్, బయో మెడికల్ ఇంజనీరింగ్, బయో టెక్నాలజీ ఇంజనీరింగ్, సెరామిక్స్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, మ్యాన్యుఫ్యాక్చ రింగ్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, మెరైన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, మెడికల్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, మైనింగ్ ఇంజ నీరింగ్, నావల్ ఆర్కిటెక్చర్ ఇంజనీరింగ్, పాలీమర్ ఇంజనీరింగ్, టెక్స్‌టైల్ ఇంజనీరింగ్, సైబర్ సెక్యూరిటీ, కంప్యూటర్ సైన్స్, మెటాలర్జీ, మెటరాలజీ, రోబోటిక్స్, కంప్యూటర్ అప్లికేషన్స్

● మేనేజ్‌మెంట్ కోర్సులు:

బ్యాంక్ మేనేజ్‌మెంట్, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్, బిజినెస్



మేనేజ్‌మెంట్, కాస్ట్ అండ్ వర్క్స్ అకౌంట్స్, చార్టర్డ్ అకౌంటెన్సీ, చార్టర్డ్ ఫైనాన్షియల్ అనాలిసిస్, ఈవెంట్ మేనేజ్‌మెంట్, హాస్పిటల్ మేనేజ్‌మెంట్, హోటల్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఇన్సూరెన్స్, లాజిస్టిక్స్ అండ్ సప్లై చెయిన్ మేనేజ్‌మెంట్, మేనేజ్‌మెంట్

● ఇతర కోర్సులు

ఆస్ట్రోనమీ అండ్ ఆస్ట్రో ఫిజిక్స్, ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్స్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్, ఫిజికల్ సైన్సెస్, అగ్రికల్చర్ సైన్స్, బయోలాజికల్ సైన్స్, బయోటెక్నాలజీ, ఎర్త్‌సైన్స్ /జాగ్రఫీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్, ఫిషరీస్, ఫ్లోరికల్చర్/హార్టికల్చర్, ఫుడ్ టెక్నాలజీ, ఫారెస్ట్రీ, ఓషియనోగ్రఫీ, స్టాటిస్టికల్ సైన్స్, వైల్డ్ లైఫ్ బయాలజీ, జువాలజీ, ఆంత్రోపాలజీ, ఆర్కియాలజీ, ఆర్ట్ రిస్టోరేషన్, క్యూరేషన్, ఎడ్యుకేషనల్/వొకేషనల్ స్కూల్ కౌన్సిలర్, మాన్యుమెంట్స్ అండ్ స్కల్ప్చర్ రిస్టోరేషన్, మ్యూసియాలజీ, సోషల్ వర్క్, స్పెషల్ ఎడ్యుకేటర్, లా, అడ్వర్టైజింగ్, జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్, పబ్లిక్ రిలేషన్స్, ఆర్ట్ డైరెక్షన్, కొరియోగ్రఫీ, డైరెక్షన్, ఫిల్మ్ /డ్రామా ప్రొడక్షన్, ఫైన్ ఆర్ట్స్, పర్ఫామింగ్ ఆర్ట్స్, వోకల్ అండ్ ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్, యానిమేషన్, సినిమాటోగ్రఫీ, కమ్యూనికేషన్ డిజైన్, డిజైన్, గ్రాఫిక్ డిజైనింగ్, ఫోటోగ్రఫీ, యాక్చురియల్ సైన్సెస్, బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్, డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్, బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్, కార్పొరేట్ ఇంటెలిజెన్స్, డిటెక్టివ్, ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రీషియన్, ఫారిన్ లాంగ్వేజెస్, హోమ్ సైన్స్, ఇంటీరియర్ డిజైనింగ్, లిబరల్ స్టడీస్, లైబ్రరీ సైన్సెస్, మాంటెస్సరీ టీచింగ్, న్యూట్రీషియన్ అండ్ డైటెటిక్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ అండ్ స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్, టూరిజం అండ్ ట్రావెల్.

● వైద్య సంబంధ కోర్సులు:



ఆయుర్వేద (బీఏఎంఎస్), డెంటల్ బీడీఎస్, హోమియోపతి, న్యాచురోపతి, ఫార్మసీ, సిద్ధ, యునానీ, ఫిజియోథెరపీ, రిహ్యాబిలి టేషన్ సైకాలజీ, రిహ్యాబిలిటేషన్ థెరపీ, ఫిజియోథెరపీ, రిహ్యాబిలిటేషన్ సైకాలజీ, రిహ్యాబిలిటేషన్ థెరపీ, వెటర్నరీ సైన్సెస్, స్పీచ్ లాంగ్వేజ్ అండ్ హియరింగ్

బెస్ట్ అవైలబుల్ స్కూళ్ల ఫీజుల

బకాయిలు విడుదల చేయాలి

- బీఏఎస్ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి శేఖర్‌రావు

కరీంనగర్ టౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బెస్ట్ అవైలబుల్ స్కూళ్లకు సంబంధించిన ఫీజు బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని, లేనిపక్షంలో స్కూళ్లను ప్రభుత్వమే నడిపించాలని బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ రాష్ట్ర కార్యదర్శి, ట్రస్మా రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కోసం రాష్ట్రంలో 180 బెస్ట్ అవైలబుల్ స్కూళ్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో ఎస్సీ విద్యార్థులు 18వేలు, ఎస్టీ విద్యార్థులు 7వేల మంది మొత్తం 25వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2004లో ఆనాటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించారని తెలిపారు. 17వేల మంది అణచి వేతకు గురైన వర్గాలకు సంబంధించిన వారు, ఎక్కువ మంది జోగిని వ్యవస్థకు గురైన వారి పిల్లలు, వ్యవసాయ కూలీల పిల్లలు లబ్ధిపొందారని పేర్కొన్నారు. ఒక్కో విద్యార్థికి 20వేల రూపాయలు చెల్లించే వారని, తెలంగాణ ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ ఈ సీట్ల సంఖ్యను 25 వేలకు పెంచడమే కాకుండా రూ.20 వేల మొత్తాన్ని రూ.42 వేలకు పెంచారని పేర్కొన్నారు. ఏటా రూ.100 కోట్ల బడ్జెట్ రిలీజ్ చేశారని, ఇందులో రూ.80 కోట్లు హాస్టళ్లకు రూ.20 కోట్లు డేస్కాలర్ విద్యార్థులకు నిధులు విడుదలయ్యేవని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సీఎం రేవంత్‌రెడ్డి రెండేళ్లకు 200 కోట్ల నిధులు విడుదల చేయాల్సి ఉండగా మంత్రులు, ఎమ్మెల్యేలు తమకు అనుకూలంగా ఉన్న స్కూళ్లకు రూ.50 కోట్లు మంజూరు చేయించుకున్నట్లు తెలిపారు. మిగతా 150 కోట్లు ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నిధులు విడుదల చేయక పోవడం శోచనీయమని పేర్కొన్నారు. వెంటనే 150కోట్ల నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే తదుపరి కార్యాచరణ చేపడుతామన్నారు.

కొండగట్టులో చలువ పందిళ్ల జాడేదీ?

మల్యాల, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ప్రతి వేసవిలో భక్తుల సౌకర్యార్థం కొండగట్టు అంజనేయస్వామి ఆలయ పరిధిలో చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తుండగా ఈ సారి ఇంకా వాటి జాడ కనిపించడం లేదు. ఇటీవల భానుడి ప్రతాపంతో ఎండలు మండుతుండగా భక్తులు అసౌకర్యానికి గురి అవుతున్నారు. ఆలయ ఆవరణంలో నడవడానికి కొంత మేర మ్యాట్ వేయగా చలువ పందిళ్లు మాత్రం ఏర్పాటు చేయలేదు. ప్రతి ఏటా టెండర్ ద్వారా సుమారు రూ.10లక్షల పైచిలుకుతో చలువ పందిళ్లు వేస్తుండగా ఇప్పటి వరకు ఏర్పాటు కాకపోవడంతో మధ్యాహ్న సమయంలో ఆలయ ఆవరణలో భక్తులు పరుగులు పెట్టాల్సి వస్తోంది. విద్యాసంస్థలకు త్వరలోనే వేసవి సెలవులు రానుండడం, హనుమాన్ జయంతి ఉత్సవాలు సమీపిస్తుండడంతో భక్తుల రాక పెరుగుతుంది. టెండర్ ప్రక్రియ పూర్తి అయినప్పటికీ ఏర్పాటు చేయకపోవడంపై భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. త్వరితగతిన ఏర్పాటు చేసి ఇబ్బందులు లేకుండా చూడాలని భక్తులు అంటున్నారు. త్వరలో చలువ పందిళ్ల పనులు ప్రారంభం అవుతాయని దేవస్థానం పర్యవేక్షకులు సునీల్ తెలిపారు.



కొండగట్టు అంజన్న ఆలయం

ఆలయంలో భక్తుల రద్దీ

కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో సందడిగా మారింది. వేకువజాము నుంచే వందలాదిగా వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముని ఆలయంలో పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్ ఇతర అధికారులు పర్యవేక్షించారు.

కనుమరుగవుతున్న గొంగళ్లు

● ఆదరణ కోల్పోవడంతో నేసే వారు కరువు

కొడిమ్యాల, మార్చి22 (ఆంధ్రజ్యోతి) : కొడిమ్యాల మండలంలోని పూడూర్, నమిలికొండ గ్రామాలు 20 సంవత్సరాల క్రితం గొంగళ్ల నేతకు ప్రసిద్ధి చెందాయి. కానీ ప్రస్తుతం గొంగళ్లకు ఆదరణ తగ్గింది. గొంగళ్లకు ప్రత్యామ్నాయంగా మార్కెట్‌లోకి పలు రకాల బ్లాంకెట్లు రంగ ప్రవేశం చేయడంతో గొంగళ్లు క్రమంగా కనుమరుగవుతున్నాయి. మండలంలోని పూడూర్, నమిలికొండ గ్రామాల్లో గతంలో సుమారు 50 మంది గొంగళ్లను నేస్తూ జీవనోపాధి పొందేవారు. ప్రస్తుతం ఆదరణ కోల్పోవడంతో గొంగళ్లు నేసే వారు కూడా కరువయ్యారు. ప్రస్తుతం పూడూర్ గ్రామానికి చెందిన రొడ్డ అంజయ్య అనే వ్యక్తి కర్ణాటక రాష్ట్రం నుంచి గొర్రె ఉన్నితో తయారు చేసిన గొంగళ్లను తీసుకువచ్చి పసుపు, ఎరుపు రంగులలో కడ అంచు కట్టి విక్రయిస్తున్నాడు. డిజైన్‌ను బట్టి 300 రూపాయల నుంచి 3వేల రూపాయల వరకు ఒక్కో గొంగళి ధర పలుకుతోంది. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ మల్లన్న పట్నాల సమయంలో సుమారు లక్ష రూపాయల విలువైన గొంగళ్లు అమ్ముడు పోతాయన్నారు. ఉమ్మడి జిల్లాలోని



ప్రధాన పట్టణాలకు వెళ్లి అక్కడ గొంగళ్లను అమ్ముకునే వారికి హోల్‌సేల్‌గా ఇచ్చివస్తాన్నారు.

సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలి

-రొడ్డ అంజయ్య, పూడూర్ గ్రామం



గొంగళ్ల తయారీకి కుర్మలకు ప్రభుత్వం సబ్సిడీపై రుణాలను మంజూరు చేయాలి. 50 సంవత్సరాలు దాటిన కుర్మలకు ప్రభుత్వం పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలి.



అంచు కట్టుతున్న మహిళలు

ధర్మపురిలో ఘనంగా ఉగ్ర నారసింహుడి ఏకాంతోత్సవం



ధర్మపురిలో ఉగ్ర నారసింహస్వామి ఏకాంతోత్సవం



శేషప్ప కళావేదికపై చిన్నారుల ప్రదర్శన

● ముగిసిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

ధర్మపురి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో శ్రీ లక్ష్మీ నృసింహస్వామి (ఉగ్ర) వారల ఏకాంతోత్సవం శనివారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు రాత్రి వేళలో అందంగా పూలతో అలంకరించిన స్వామి వారలకు ప్రత్యేక పూజలు, హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను సేవలపై ఉంచి ఆలయం చుట్టు ఏడుసార్లు ప్రదక్షిణలు చేయించారు. అనంతరం స్వామి వారలను పవళింపజేసి ఏకాంతోత్సవం నిర్వహించారు. దీంతో శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలు ముగిశాయి. అంతకు ముందు శేషప్ప కళావేదికపై సాంస్కృతిక ప్రదర్శనలు చేపట్టారు. ధర్మపురి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్ తదితరులు పాల్గొన్నారు.

26,27 తేదీల్లో వేములవాడ, ధర్మపురి ప్రాంతాల్లో బీసీ కమిషన్ అధ్యయనం

హైదరాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తమ కులాల పేర్లను మార్చాలని వివిధ వర్గాల నుంచి వచ్చిన అభ్యర్థనలను స్వీకరించిన బీసీ కమిషన్ క్షేత్ర స్థాయిలో పరిశీలించేందుకు వేములవాడ, ధర్మపురి ప్రాంతాల్లో పర్యటించనున్నది. బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ నేతృత్వంలో సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మిలతో కూడిన అధికారుల బృందం ఈనెల 26న వేములవాడ, 27న సిరిసిల్లలో వంశరాజ్, దొమ్మర కులస్థుల నివాస ప్రాంతాలను సందర్శించనున్నారు. అదే రోజున జగిత్యాల, ధర్మపురి ప్రాంతాల్లో పర్యటించనున్నారు.

అఖిల భారత సివిల్ సర్వీసెస్ ఖో-ఖో పోటీలకు

ఉమ్మడి జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు



ఖో-ఖో పోటీలకు ఎంపికైన వ్యాయామ ఉపాధ్యాయులు

కరీంనగర్ స్పోర్ట్స్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత సివిల్ సర్వీసెస్ ఖో-ఖో పోటీలకు జిల్లాకు చెందిన ఐదుగురు వ్యాయామ ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు న్యూఢిల్లీలో జరుగుతున్న అఖిల భారత సివిల్ సర్వీసెస్ ఖో-ఖో పోటీల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు కట్ట సంతోష్(చామనపల్లి జడ్పీహెచ్ఎస్), పీచు జ్యోతి(బొమ్మనపల్లి జడ్పీహెచ్ఎస్), జి రేణుక(కొత్తపల్లి జడ్పీహెచ్ఎస్), మార్గం నవీన్(నంచర్ల జడ్పీహెచ్ఎస్), వాసం నవీన్‌కుమార్(భూషణ్‌రావుపేట జడ్పీహెచ్ఎస్)లు పాల్గొంటున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర జట్టు ఎంపిక పోటీల్లో విశేష ప్రతిభచాటిన వీరు అఖిల భారత సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల క్రీడల్లో తెలంగాణ రాష్ట్ర ఖో-ఖో జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ సందర్భంగా వీరిని కరీంనగర్ జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఖో-ఖో అసోసియేషన్ రెఫరీస్ బోర్డు కన్వీనర్ వి సూర్యప్రకాశ్, ఉమ్మడి జిల్లా ఖో-ఖో అసోసియేషన్ సభ్యులు సీఏ కుమారస్వామి, ఎస్ఏ రమేష్, సీహెచ్ తిరుపతిరెడ్డి, ఏ రవీందర్, ఎస్కే మోయినుద్దీన్, ఆర్ తిరుపతిరెడ్డి, పెద్దపల్లి జిల్లా ఖో-ఖో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్ కుమార్, డాక్టర్ వి కుమారస్వామి, రైల్వే ఖో-ఖో కోచ్ ఇ నరేష్, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

రసాయన శాస్త్రంతో ఉపాధి అవకాశాలు

గణేశ్‌నగర్, మార్చి22 (ఆంధ్రజ్యోతి): రసాయన శాస్త్ర అధ్యయనంతో విస్తృత ఉపాధి అవకాశాలు ఉన్నాయని డాక్టర్ కే కిరణ్ కుమార్ అన్నారు. శనివారం ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మెగా జాబ్ ఫెయిర్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లీ ఫార్మా లిమిటెడ్ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ కే కిరణ్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ కష్టపడి పనిచేస్తూ లక్ష్య సాధన దిశగా పయనించాలని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె రామకృష్ణ, కళాశాల వైస్ ప్రిన్సిపల్ పి నితిన్. రసాయన శాస్త్ర విభాగాధిపతి మేజర్ రేళ్ల సంజీవ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పెద్దూర్‌లో తాగునీటి కటకట..

- నెల రోజుల క్రితం కాలిపోయిన విద్యుత్ మోటారు
- వ్యవసాయ బోర్ల నుంచి నీళ్లు తెచ్చుకుంటున్న ప్రజలు
- ఫిర్యాదులు చేసినా పట్టించుకోని మున్సిపల్ అధికారులు

సిరిసిల్ల రూరల్, మార్చి 22 (అంధ్రజ్యోతి) : వేసవి ప్రారంభంలోనే తాగునీటి ఎద్దడి నెలకొనడంతో ప్రజలు తల్లడిల్లిపోతున్నారు. గ్రామంలో తాగునీటి కోసం ఏర్పాటుచేసిన బోర్లు చెడిపోవడంతో నెల రోజులు నుంచి పెద్దూర్ గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక కౌన్సిలర్‌తో పాటు మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ గ్రామాన్ని మున్సిపల్‌లో విలీనం చేసిన సమయంలో 8వ వార్డు, 9వ వార్డులుగా విభజించారు. అయితే పెద్దూర్ గ్రామంతోపాటు 9వ వార్డులోని దూప్యానాయక్ తండా, మాలపల్లె, తుర్కకాశీకాలనీ, బాబాజీ కాలనీలలో ఉన్న బోర్‌మోటార్లు నెలరోజుల క్రితం కాలి పోవడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. బోర్‌మోటార్‌కు



సిరిసిల్ల పెద్దూర్‌లో దుప్యానాయక్ తండాలో వ్యవసాయ బోరునుంచి వేసుకున్న పైప్‌లు ↑ తండాలో కాలిపోయిన బోర్‌మోటర్ →

మరుమ్మతులు చేయించాలని ఇద్దరు మాజీ కౌన్సిలర్లతోపాటు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరు పట్టించుకోవడం లేదని, మిషన్ భగీరథ నీరు సక్రమంగా రాకపోవడంతో నీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని మహిళలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలిపోయిన బోర్‌మోటార్‌ను బాగుచేయించి నీటిని అందించాలని ప్రజలు కోరుతున్నారు.

● తాగునీటి బావుల పైప్‌లైన్‌లను బాగు చేయాలి పెద్దూర్ గ్రామపంచాయతీగా ఉన్న సమయంలో తాగునీటిని అందించేందుకు పక్కనున్న మానేరు వాగులో జీపీ నిధులతో రెండు బావులతో పాటు బోర్లను వేశారు. మంచినీటి ట్యాంక్‌లకు పైప్‌లైన్‌లను వేసి నీటిని అందించారు. మిషన్ భగీరథ రావడంతో ఆ బావులు, బోర్లను మున్సిపల్ అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేశారు. దీంతో గుర్తు తెలియని వ్యక్తులు ఆ పైప్‌లైన్‌లను దొంగిలించారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు మానేరు వాగులోని బావులు, బోర్లకు కొత్తగా పైప్‌లైన్‌లను వేసి నీళ్లు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

బోరు కాలిపోవడంతో తాగునీటి కోసం ఇబ్బందులు..

- భూక్య విజయ, దూప్యానాయక్ తండా



పెద్దూర్ శివారులోని దూప్యానాయక్ తండాలో తాగునీరు అందించే బోరు నెలరోజుల క్రితం కాలిపోయింది. దీంతో నీటి కోసం ఇబ్బందులు పడుతున్నాం. రోజు ఉదయం, సాయంత్రం వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్నాం. మున్సిపల్ అధికారులు స్పందించి కాలిపోయిన బోర్‌లను మరమ్మతులు చేయించాలి.

మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదు..

- షేక్ అలీబీ, తుర్కకాశీ కాలనీ, పెద్దూర్



పెద్దూర్ శివారులోని తుర్కకాశీ కాలనీలో మిషన్ భగీరథ నీటి కోసం ట్యాంక్‌ను నిర్మించి ఇంటింటికి నల్లాలను ఏర్పాటు చేశారు. సంవత్సరాలు గడుస్తున్నా ఇంతవరకు మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదు. వ్యవసాయ బావుల వద్దకు వెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో నీటి ఎద్దడిని తీర్చాలి.

వడగండ్లు.. కడగండ్లు...

(5వ పేజీ తరువాయి)

పరిస్థితి ఏర్పడింది. ఇప్పటి కైనా వచ్చే సీజన్ నుంచైనా పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని రైతులు కోరుతున్నారు.

జిల్లాలో 15.3 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం

పెద్దపల్లి జిల్లాలో శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు 15.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సాయంత్రం ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులు, పిడుగులతో భారీ వర్షం కురిసింది. కొన్ని గ్రామాల్లో వడగళ్ల వాన కురవడంతో పంటలకు నష్టం వాటిల్లింది. అత్యధికంగా ధర్మారం మండలంలో 46.8 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. పెద్దపల్లి మండలంలో 33.0 మిల్లీ మీటర్లు, అంతర్గాం 27.3, జూలపల్లి 26.5, రామగిరి 19.2, ఎలిగేడు 16.7, కమాన్‌పూర్ 11.3, రామగుండంలో 8.1, సుల్తానాబాద్ 6.2, మంథని 5.4, ఓదెల 4.3, కాల్వశ్రీరాంపూర్ 4.0, పాలకుర్తి 3.6, ముత్తారం మండలంలో 2.2 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది.

● 2022 మార్చి, ఏప్రిల్, మే నెలలో కురిసిన అకాల వర్షాలకు పెద్దఎత్తున పంటలు దెబ్బతి నగా, కేవలం 6 వేల ఎకరాల పంటను కోల్పోయిన రైతులకే అప్పటి ప్రభుత్వం ఎకరానికి 10 వేల రూపాయల చొప్పున నష్ట పరిహారం చెల్లించింది. మరో 20వేల ఎకరాల్లో పంట నష్ట పోయిన రైతులకు రిక్తహస్తం చూపించారు. గడిచిన ఏడాది స్వల్పంగానే అకాల వర్షాలు పడినప్పటికీ, కొద్దిపాటి పంట నష్టం వాటిల్లగా, వారికి ప్రభుత్వం పరిహారం చెల్లించింది.

కారుణ్య నియామకాల ఉత్తర్వులు అందజేత



నియమాక పత్రాలను అందిస్తున్న జీఎం సుధాకర్‌రావు

రామగిరి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని వివిధ గనులు, విభాగాలలో విధులు నిర్వహిస్తూ అనారోగ్య కారణాలతో మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన 15మంది ఉద్యోగుల డిపెండెంట్‌లకు శనివారం జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్జీ-3జీఎం సుధాకర్‌రావు చేతుల మీదుగా కారుణ్య నియామక ఉత్తర్వులను అందజేశారు. గుర్తింపు సంఘం నాయకులు రామచంద్రారెడ్డి, ప్రాతినిధ్య సంఘం నాయకుడు కోటరవీందర్‌రెడ్డి, అదికారులు సుదర్శనం, గుర్రంశ్రీహరి, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల అరెస్టును వ్యతిరేకిస్తూ నిరసన

సుల్తానాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వివిధ రంగాలలో పని చేస్తున్న కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని అం దోళనలు చేస్తున్న కార్మికులను అరెస్టు చేయడాన్ని వ్యతిరేకిస్తూ శని వారం సిఐటియు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. నల్ల బ్యాడ్జీలు ధరించి నినాదాలు చేశారు. జిల్లా కార్యదర్శి ముత్యం రావు మాట్లాడుతు అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నపుడు తమ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళడానికి హైదరాబాద్ ఇందిరా పార్కుల ధర్నాలు చేయ డం పరిపాటని, ప్రభుత్వం అనుమతులు ఇస్తూ మరో వైపు అక్కడికి వెళ్ళకుండా ముందస్తు అరెస్టులు చేస్తున్నారన్నారు. ప్రజా పాలన పేరు తో పర్మిషన్లు ఇస్తూ దొంగ చాటుగా అరెస్టులు చేయడం ప్రభుత్వం డబుల్ గేమ్‌కు నిదర్శనమన్నారు.

ఫొటోగ్రాఫర్‌కు ఆర్థిక సహాయం

పాలకుర్తి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఈసాలతక్కళ్లపల్లి గ్రామానికి చెందిన గుండ మధు అనే ఫొటోగ్రాఫర్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలు విరిగింది. సమాచారం తెలుసుకున్న ఫొటో గ్రాఫర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పోగుల విజయ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లెర్ల ఉదయ్, జిల్లా కార్యదర్శి ఇర్ఫాన్ తో పాటు మండల సభ్యులు శనివారం మధును పరామర్శించి రూ.12 వేల చెక్కును అందించారు. యూనియన్ మండల అధ్యక్షుడు వైద్య నరేష్ ,రాష్ట్ర సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు ఇఫ్తార్ విందు

కళ్యాణ్‌నగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రంజాన్ సందర్భంగా ఆదివారం ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టనున్న ఇఫ్తార్ విందు ఏర్పాట్లపై శనివారం గోదావరిఖని ప్రభుత్వాసుపత్రి వద్ద ఉన్న ఈద్గాను రామగుండం తహసీల్దార్ కుమారస్వామి సందర్శించారు. ఏర్పాట్లను పరిశీలించారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు.

రేపు దుకాణాల బహిరంగ వేలం

ఎలిగేడు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఎలిగేడు మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ దుకాణ సముదాయం (షట్టర్లు)ను ఈనెల 24న ఉదయం 11గంటలకు బహిరంగ వేలం వేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి అంజలి తెలిపారు. 1నుండి 8వరకు ఉన్న గదులకు రూ.20,000, 9నుండి 19గదులకు రూ.5,000ల చొప్పున స్పెషల్ ఆఫీసర్ జీపీ కార్యదర్శి పేరున డీడీ చెల్లించాలన్నారు. వేలంలో పాల్గొనేవారు పంచాయతీలో ఎలాంటి బకాయిన్న అనర్హులని ఆమె పేర్కొన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబు చిత్రపటానికి క్షీరాభిషేకం



శ్రీధర్‌బాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న గ్రామస్థులు

రామగిరి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): కల్వచర్ల గ్రామపంచాయతీ పరిధిలోని కుర్మపల్లి, గొల్లపల్లి, ఎస్సీ కాలనీ వాసులు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. గత ఎన్నికల్లో గ్రామస్తులకు రోడ్డు వేయిస్తానని ఇచ్చిన హామీ మేరకు రోడ్డు పనులు ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబుకు కృతజ్ఞతలు తెలుపుతూ శనివారం రాత్రి గ్రామస్తులు ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కుర్మపల్లి, గొల్లపల్లి, ఎస్సీ కాలనీకి చెందిన మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి



రౌడీ షీటర్లను ఉద్దేశించి మాట్లాడుతున్న ఏసీపీ గజ్జి కృష్ణ

సుల్తానాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ అన్నారు. సర్కిల్ పరిధిలోని సుల్తానాబాద్, కాల్వశ్రీరాంపూర్, పొత్కపల్లి, జూలపల్లి పోలీస్‌స్టేషన్లలో రౌడీ షీటర్లుగా నమోదైన వారితో సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఏసీపీ గజ్జి కృష్ణ మాట్లాడుతు క్షణికావేశంలో వివిధ సందర్భాలలో కేసులలో ఇరుక్కున్న వారు సమాజంలో సత్ప్రవర్తనతో మెదలాలని సూచించారు. పదే పదే కేసుల పాలవుతూ రౌడీ షీటర్లుగా నమోదు అయి జీవితాలను అంధకారం చేసుకోవద్దన్నారు. సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐలు శ్రావణ్ కుమార్, వెంకటేశ్, రమేష్, సన్నత్ కుమార్ పోలీసులు పాల్గొన్నారు.

అకాల వర్షంతో రైతన్నకు తీవ్ర నష్టం



హన్మంతునిపేటలో పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాదికారి ఆదిరెడ్డి

పెద్దపల్లి రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం కురిసిన అకాల వర్షం, వడగండ్ల వానతో రైతన్నలు తీవ్రంగా నష్టపోయారు. ముత్తారం, రాంపల్లి, హన్మంతునిపేట, భోజన్న పేట, చీకురాయి, పెద్దబొంకూరు గ్రామాల్లో రైతులు వేసిన వరి పంట, కూరగాయలు, మొక్కజొన్న పంటలు పూర్తిగా నేల మట్టమయ్యాయి. వడ గండ్ల వానకు ధాన్యం పూర్తిగా నేలరాలి నష్టం వాటిల్లింది. మండల వ్యాప్తంగా 1300 ఎకరాల్లో వరి, 291 ఎకరాల్లో మొక్కజొన్న, కూరగాయల పంట నష్టం వాటిల్లినట్లు మండల వ్యవసాయాధికారి అలివేణి పేర్కొన్నారు. జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి హన్మంతునిపేట, రాంపల్లి గ్రామాల్లో వరి పంటలను పరిశీలించారు. ఏడీఏ శ్రీనాథ్, ఏవో అలివేణి, ఏఈవో ప్రశాంత్‌తో పాటు రైతులు ఉన్నారు.

కాగా మండలంలోని పలు గ్రామాల్లో కురిసిన అకాల వర్షానికి నష్టపోయిన పంటలను శనివారం బీజేపీ నాయకులు పరిశీలించారు. చీకురాయిలో బీజేపీ మండల అధ్యక్షుడు వేల్పుల రమేష్ ఆధ్వర్యంలో పరిశీలించి మాట్లాడారు. వరి, మొక్క జొన్న పంటలకు నష్టం వాటిల్లిందని, అధికారులు అంచనా వేసి రైతులకు న్యాయం చేయాలన్నారు. మేకల శ్రీనివాస్ యాదవ్, రాజమహంత కృష్ణ, ఒల్లే తిరుపతి, ముంజ రాజేంద్ర ప్రసాద్, సతీష్, ఉమేష్, గాండ్ల రాజేష్ పాల్గొన్నారు.

ఓదెల, (ఆంధ్రజ్యోతి): మండలంలో గాలి దుమారానికి మండల కేంద్రంతోపాటు కొలనూర్‌లో మొక్కజొన్న, వరి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఉధృతంగా వీచిన గాలికి ఓదెల దొమ్మటికుమార్ అనే రైతుకు చెందిన రెండేకరాల మొక్కజొన్న నేలవాలింది. కొలనూరు, ఉప్పరపల్లిలో ముగ్గురు రైతులకు చెందిన 13 ఎకరాల మొక్కజొన్న గాలులకు ధ్వంసమైంది. కొలనూర్‌కు చెందిన కొల్లూరి మదునయ్య అనే రైతుకు చెందిన ఎకరం వరి పంట నేల వాలింది. అధికారులు ఆదుకోవాలని రైతులు కోరారు.

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): అకాలవర్షంతో అన్నదాతకు నష్టం వాటిల్లినట్లు అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్(ఏడీఏ)అన్నారు. ర్యాకల్‌దేవ్‌పల్లి, ధూళికట్ట, లాలపల్లి, సుల్తాన్‌పూర్, ముప్పి రితోట గ్రామాల్లో నష్టపోయిన మొక్కజొన్న పంటలను పరిశీలించారు. అకాల వర్షానికి మండలంలో సుమారు 209ఎకరాల్లో మొక్కజొన్న పంటలకు నష్టం జరిగిందని పేర్కొన్నారు. ఏవో ఉమాపతి, ఏఈవోలు గణేష్, సురేష్, నరేష్, రైతులు తదితరులుపాల్గొన్నారు.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): వర్షాలకు, వడగళ్ళ వానలకు పలు గ్రామాలలో పంటలు దెబ్బతిన్నాయి. సుద్దాల మియాపూర్ పెర్కపల్లి తదితర గ్రామాలలో వడగళ్ళ వానలు కురిశాయి. రేగడిమద్దికుంట, మల్లయ్యపల్లి పెరుకపల్లి తదితర గ్రామాలలో పాక్షికంగా మొక్కజొన్న పంట దెబ్బతిన్నట్లు రైతులు తెలిపారు. నీరుకుళ్ల తదితర గ్రామాలలో వరి పంట దెబ్బతింది. పొలంలో గొలుసులకు ఉన్న గింజలు నేలరాలాయి. సుద్దాల కదంబాపూర్, రేగడిమద్దికుంటలో మామిడికాయలు దెబ్బతిన్నాయి.



భూపతిపూర్‌లో షెడ్డు కూలి మృతి చెందిన గొర్రెలు



ధూళికట్టలో దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు

మండలంలోని భూపతిపూర్‌లో గొర్ల షెడ్డు కూలిపోయింది. అందులో ఉన్న గొర్లలో పదిహేను గొర్రెలు మృతి చెందాయి. మరో ఎనిమిది గొర్లు గాయపడ్డాయి. భూపతిపూర్ గ్రామానికి చెందిన సంబుల లచ్చయ్య అనే గొర్లకాపరి షెడ్డులో పడుకున్నాడు. ఈదురు గాలులకు ఒక్కసారిగా షెడ్డు కూలడంతో అందులో గొర్రెలు మృతి చెందాయి. షెడ్డు పక్కన నిద్రించే లచ్చయ్యకు ప్రమాదం తప్పింది. గొర్ల మృతితో తమ ఉపాధి పోయిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు వేడుకుంటున్నాడు.

జూలపల్లి, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో కురిసిన వడగండ్ల వర్షానికి వందలాది ఎకరాల్లో మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. మండల కేంద్రంతో పాటు వడుకాపూర్,బాల్‌రాజ్‌పల్లి, పెద్దాపూర్, కాచాపూర్, వెంకట్రావుపల్లి, కోనరావుపేట, తెలుకుంట, కుమ్మరికుంట గ్రామాల్లో మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. అకాల వర్షానికి దెబ్బతిన్నా పంటలకు రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. దెబ్బతిన్న మొక్కజొన్న పంటలను మండల వ్యవసాయ అదికారిని ప్రత్యూష, ఏఈఓలు రాకేష్, కిరన్మయి రైతులతో కలిసి పరిశీలించి, పంటల నష్టం వివరాలను చేకరించారు.

రాజకీయాల్లో మార్పు యువతతోనే సాధ్యం

కోల్‌సిటీటౌన్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): దేశ ఆర్థిక, సామాజిక, రాజకీయాల్లో మార్పు తెగలిగే శక్తి యువతలో ఉందని మంచిర్యాల జిల్లా ఆర్‌డీవో, సబ్ డివిజన్ మేజిస్ట్రేట్ గూడూరి శ్రీనివాసరావు అన్నారు. శనివారం గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ -2025 కార్యక్రమం రెండవ రోజు కొనసాగింది. ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాసరావు ప్రసంగిస్తూ ప్రపంచ దేశాల్లోనే అత్యధిక యువత దేశంలోనే ఉందన్నారు. దేశ భవిష్యత్‌ను నిర్ధారించే శక్తి యువతరంపై ఉందన్నారు. అలాంటి శక్తియుక్తులను వెలికి తీయడంలో భాగంగా యువతలో నాయకత్వాన్ని పెంపొందించేందుకు యువ పార్లమెంట్ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. యువత ఎన్నికల ప్రక్రియలో భాగస్వామ్యం కావాలని, మంచి నాయకుడు యువత నుంచే ఎదగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వాన్ని నడిపించే సమర్థవంతమైన నాయకుడు ప్రజాస్వామ్య వ్యవస్థకు ఇరుసులాంటి వారన్నారు. లక్ష్యసాధనలో గురువుల మార్గదర్శనం విజయాన్నిస్తుందన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌డీవో శ్రీనివాసరావు

అనంతరం వన్‌నేషన్, వన్ ఎలక్షన్, పేవింగ్ ది వేపర్ వికసిత్ భారత్‌పై విద్యార్థులు అభిప్రాయాలను వ్యక్తం చేశారు. యువ పార్లమెంట్ నోడల్ అధికారి ఎ.సాంబశివరావు, కళాశాల ప్రిన్సిపాల్ జైశంకర్ ఓజా, పెద్దపల్లి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మీనర్సయ్య, సీనియర్ అధ్యాపకులు డాక్టర్ అనంతుల సతీష్‌కుమార్, స్టాఫ్ సెక్రటరీ డాక్టర్ సుబ్బారావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు డాక్టర్ ఎం.నరేష్, డాక్టర్. కిరణ్మయి, ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ బి.తిరుపతి, డాక్టర్ శారద, శంకరయ్య, అజయ్‌కుమార్, శ్రీదేవి, స్రవంతి, టీఎస్‌కేసీ మెంటార్ ఉష, రవీందర్, కిరణ్‌కుమార్, వాలంటీర్లు, ఎన్‌సీసీ కెడెట్లు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు కృతజ్ఞత సభ

ధర్మారం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): చట్టసభలో బీసీలకు రిజర్వేషన్లతోపాటు ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం అనంతరం నియోజకవర్గానికి వస్తున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు ఘన స్వాగతం పలుకుతామని పార్టీ మండల అధ్యక్షుడు గంగిరెడ్డి తిరుపతిరెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలక పత్తిపాక ఎక్స్‌రోడ్ నుండి రాజారాంపల్లి ఎస్ ఆర్ గార్డెన్ వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతా తెలుపుతూ సభ నిర్వహిస్తామన్నారు. ఏ ఎం సి చైర్మన్ లావుడ్యా రూప్లానాయక్, వైస్ చైర్మన్ అరిగే లింగయ్య, యూత్ అధ్యక్షుడు సోగాల తిరుపతి, కొత్త నర్సింలు, రాంపల్లి రాజేశం, ఏదుల్ల అంజయ్య, వీర్ పాల్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ ప్రొసీడింగ్స్ అందజేత

కోల్‌సిటీ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో ఎల్ఆర్ఎస్ పథకంలో ఫీజు చెల్లించిన వారికి శనివారం నగర కమిషనర్ అరుణశ్రీ ప్రొసీడింగ్స్ అందజేశారు. ఫీజులు చెల్లించిన వెంటనే ప్రొసీడింగ్స్ జారీ చేయడం జరుగుతుందని, ఎల్ఆర్ఎస్ దరఖాస్తు చేసుకున్న వారు నిర్దేశించిన ఫీజు చెల్లించి 25శాతం రాయితీని పొందాలని ఆమె సూచించారు.

విద్యార్థులకు కళ్లద్దాల పంపిణీ

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ బాలల స్వస్థత కార్యక్రమంలో భాగంగా శనివారం సెక్టార్-3 సింగరేణి హైస్కూల్ విద్యార్థులకు కళ్ళద్దాల పంపిణీ చేశారు. 10వ తరగతి విద్యార్థులకు వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించారు. అల్లూరు పట్టణ ఆరోగ్య కేంద్ర సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమం



నృత్యాలు చేస్తున్న చిన్నారులు

పెద్దపల్లి రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నిమ్మనపల్లి పల్లవి స్కూల్‌లో శనివారం సాయంత్రం క్రీడా విజయోత్సం అలరించింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ మాజీ చైర్మన్ ఎల్.రాజయ్య హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల నృత్యాలు పలు వురిని ఆకట్టుకున్నాయి. పాఠశాల కరస్పాండెంట్ శోభారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లైసెన్సులు లేని వాహనదారులపై కఠిన చర్యలు

ఓదెల, మార్చి 22(ఆంధ్రజ్యోతి) : డ్రైవింగ్ లైసెన్స్‌లు, ఇన్సూరెన్స్ కాగితాలు, నంబర్ ప్లేట్లు, ధ్రువీకరణ పత్రాలు లేని వారిపై కఠినచర్యలు తీసుకుంటామని ఎస్ఐ దీకొండ రమేష్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం గ్రామస్తులతో పాటు, ఆటో డ్రైవర్లకు అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ, ట్రాఫిక్ నిబంధనలు, వాహన, రోడ్డు భద్రత చట్టాలను ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. కేసులతో పాటు జరిమానాలు విధిస్తామని తెలిపారు. అతి వేగంగా డ్రైవింగ్ చేసే వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని, అలాగే మైనర్లు ఎట్టి పరిస్థితుల్లో వాహనాలను నడపవద్దని తెలిపారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

పెద్దపల్లి రూరల్ , మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ నీటి సంరక్షణ దినోత్సవం సందర్భంగా మండలంలోని అప్పన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నీటి సంరక్షణపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. నీటిని సంరక్షించాలని విద్యార్థులతో ప్రార్థన సమయంలో ప్రతిజ్ఞ చేయించారు. వేసవికాలంలో పక్షులకు నీరు ఎలా అందించాలనే అంశంపై విద్యార్థులకు వివరిస్తూ చెట్లకు వాటర్ బాటిళ్లను ఏర్పాటు చేశారు. నీరు వృథాగా పోకుండా నల్లాలను కట్టిపెట్టాలన్నారు. పాఠశాల ఇంచార్జి హెచ్ఎం రామేశ్వర్, ఉపాధ్యాయులు వంగ అశోక్, విజయరాణి, వాసంతి, జ్యోతి, కనుకయ్య, శ్రీనివాస్, శ్రీదేవి, మంజుల, సురేందర్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

25న చలో హైదరాబాద్

ఎలిగేడు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయు)నాయకులు అక్రమ అరెస్టులను ఖండిస్తూ నిరసన కార్యక్రమం చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతి పత్రం అందజేశారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సీపెల్లి రవీందర్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికులకు తొమ్మిది నెలల వరకు వేతనాల బకాయి పడ్డాయని, వేతనాల కోసం ధర్నాలు చేస్తే తప్పగ్రాంట్ ఇవ్వని పరిస్థితి ఉందన్నారు. గత ప్రభుత్వం తీసుకు వచ్చిన జీవో నంబర్ 51వలన మల్టీపర్పస్ వర్కర్ విధానం వల్ల కార్మికులు అభద్రతా భావానికి లోనవుతున్నారన్నారు. ఈనెల 25న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని కార్మికవర్గం విజయవంతం చేయాలన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు లచ్చయ్య, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి కవ్వంపల్లి దేవేందర్, పంగ భాస్కర్, రాయపాక లక్ష్మణ్, చెవుల రమేష్, గొల్లె మల్లేష్, తిట్ల ప్రేమ్‌కుమార్, ఆసంపల్లి చంద్రయ్య, సుజాత, నాతరి రవీందర్, కార్మికుల తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి చేయూత

కోల్‌సిటీ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో మరణించిన హెడ్ కానిస్టేబుల్ కే నాగరాజు కుటుంబానికి భద్రత ఎక్స్‌గ్రేషియా రూ.7.84లక్షల చెక్కును శనివారం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా అందించారు. నాగరాజు మంచిర్యాల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో మరణించారు. నాగరాజు భార్య విజయకుమారిని కుటుంబ స్థితిగతులను తెలుసుకున్నారు. ప్రభుత్వపరంగా రావాల్సిన బెనిఫిట్స్ అందజేస్తామన్నారు. అడిషనల్ డీసీపీ(అడ్మిన్) సీ రాజు, ఏఓ శ్రీనివాస్, సూపరింటెండెంట్ సంధ్య, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు పోచలింగం పాల్గొన్నారు.

కాంట్రాక్టర్లపై చర్య తీసుకోవాలి

కమాన్‌పూర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఈజీఎస్ నిధులతో ఏర్పాటు చేసిన రోడ్లు నాణ్యత లేవని, నాణ్యతపై క్యూసీ రిపోర్ట్ చేసి వెంటనే బిల్లులు నిలిపివేయాలని యువజన కాంగ్రెస్ నాయకుడు మహ్మద్ యూసఫ్ అలియాస్ లల్లు ఈఈకి ఫిర్యాదు చేశారు. కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

మంథని అభివృద్ధికి మంత్రి శ్రీధర్‌బాబు కృషి

మంథని, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మంథని నియోజకవర్గ అభివృద్ధికి మంత్రి శ్రీధర్‌బాబు ఎంతో కృషి చేస్తున్నారని కాంగ్రెస్ నేతలు ఐలి ప్రసాద్, వొడ్నాల శ్రీనివాస్, పెండ్రు రమ-సురేష్‌రెడ్డి, ఎరుకల ప్రవీణ్, కుడుదుల వెంకన్న, జనగామ నర్సింగరావు, మంథని సత్యం వెల్లడించారు. మంత్రి క్యాంపు ఆఫీసులో శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. బడ్జెట్ కేటాయింపులో మంత్రి శ్రీధర్‌బాబుపై మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు చేసిన ఆరోపణలను వారు ఖండించారు. అనేక సంక్షేమా భివృద్ధి పథకాలతో మంత్రి శ్రీధర్‌బాబు మార్కు స్పష్టంగా కనిపిస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, దుద్దిళ్ల శ్రీనుబాబులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదన్నారు. నేతలు గోటికార్ కిషన్ జీ, పేరవేన లింగయ్య యాదవ్, అజీంఖాన్, రావికంటి సతీష్, బూడిద శంకర్, మంథని సురేష్,మంథని శ్రీనివాస్, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంథనికి శ్రీధర్‌బాబుతో మహర్దశ

ముత్తారం: మంథని నియోజకవర్గానికి మంత్రి శ్రీధర్‌బాబుతో మహర్దశ రానుందని జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ చొప్పరి సదానందం అన్నారు. ఆయన మాట్లాడుతూ కొందరు వారి ఉనికి కోసం మాయమాటలతో మంథనికి అభివృద్ధికి నిధులు రావడం లేదని మంత్రిపై దుష్ప్రచారాలు చేయడమే విధిగా పెట్టుకున్నారన్నారు. వారి మాటలు మంథనిలో పట్టించుకునే వారు ఎవరూ లేరన్నారు. కార్యక్రమంలో నాయకులు దొడ్డ బాలాజీ, మద్దెల రాజయ్య, బక్కతట్ల వినిత్, గోవిందుల పద్మ ఆనంద్, అల్లాడి యాదగిరి రావు, గాదం శ్రీనివాస్, సంపత్, అల్లం కుమార్ స్వామి పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 22(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్‌పై తీర్మానం, ఎస్సీ వర్గీకరణ బిల్లులు చేయడానికి కృషి చేసిన సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలతో పాటు మంత్రి శ్రీధర్‌బాబు చిత్రపటాలకు ఐఎన్‌టీయూసీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. శనివారం ఓసీపీ-1, ఓసీపీ-3 ప్రాజెక్టుల్లో జరిగిన ఈ కార్యక్రమాల్లో నాయకులు మాట్లాడారు. దశాబ్దకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఎస్సీ వర్గీకరణ అంశాన్ని అసెంబ్లీ తీర్మానం చేయడం, బలహీన వర్గాల ఉన్నతికి 42 శాతం రిజర్వేషన్ కోసం తీర్మానం చేయడం చారిత్రాత్మకమని అన్నారు. ఓసీపీ-1లో జరిగిన కార్యక్రమంలో గడ్డం తిరుపతి, వెంక టస్వామి, సలీం, ప్రవీణ్‌రెడ్డి, ఆరిఫ్, రవికుమార్, కొండల్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఓసీపీ-3లో జరిగిన కార్యక్రమంలో శంకర్ నాయక్, అక్రమ్, ఆకుల రాజిరెడ్డి, కొంగర రవీందర్, మల్లేష్, సమ్మయ్య, మల్లికార్జున్, అశోక్, విజయ్ మోహన్ పాల్గొన్నారు.

కోతుల బెడదతో ప్రజలు బెంబేలు





పాలకుర్తిలో కోతుల గుంపు, కిరాణ దుకాణానికి ఏర్పాటు చేసుకున్న జాలి

పాలకుర్తి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో కోతులు గుంపులు గుంపులుగా సంచరిస్తూ ప్రజలను హడలెత్తిస్తున్నాయి. కోతులు పిల్లలు, పెద్దలు, వృద్ధులపై దాడి చేస్తూ గాయపరుస్తున్నాయి. గాయపడిన వారు వ్యాక్సిన్ తీసుకోవడానికి మూడు రోజులకు ఒకసారి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల చుట్టూ తిరుగున్నారు. ప్రజలు కిరాణ సామగ్రి కొనుక్కోవడానికి వెళ్లాలన్నా భయం భయంగా వెళుతున్నారు. ఇంటి ఆవరణలో పెంచుతున్న కూరగాయలు, పండ్లు, పూల మొక్కలను ధ్వంసం చేస్తున్నాయి. దీంతో ఇంటి ఆవరణలో మొక్కలను పెంచడం లేదు. ఇండ్లల్లో చొరబడి అన్నం, కూరలు తింటున్నాయని, అడ్డుకోబోయిన ఇంటి యజమానుల మీద దాడులు చేస్తున్నాయని, కోతుల బారి నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

కోతుల బెడద తీవ్రంగా ఉంది: తన్నీరు శంకరమ్మ, గుడిపెల్లి



గ్రామంలో చాలా మందిని కోతులు కరవడంతో గాయలయ్యాయి. ఇంట్లో చొరబడి అన్నం కూరలను ఎత్తుకెళ్లుతున్నాయి. చిన్నపిల్లలు బడికి, ప్రజలు పనులకు, నిత్యావసర వస్తువులకు వెళ్ళాలన్న జంకుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకొని కోతుల బెడదను నివారించాలి.

బయటకు రావాలంటే భయంగా ఉంది: పోచయ్య



మండలంలోని కోతుల బెడద తీవ్రంగా ఉంది. ఇంటి ఆవరణలో పెంచుకుంటున్న కూరగాయలు, పండ్ల మొక్కలను పీకేస్తున్నాయి. పెంకుటిళ్లపైకి ఎక్కి పెంకులను తొలగిస్తున్నాయి. రేకుల షెడ్లపైకి ఎక్కి రభస సృష్టిస్తున్నాయి. ఇండ్లనుంచి బయటకు రావాలంటే భయంగా ఉంది. జంకుతున్నాం.